క్లుప్తంగా

డెంగీ బాధితుడికి రక్తదానం

కామారెడ్డి అర్బన్: స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్య శాల ఆస్పత్రిలో డెంగీతో బాధపడుతున్న నరేష్ అనే యువకుడికి అత్యవసరంగా బి-పాజిటివ్ రక్తం అవసరం కాగా ముదాం ప్రవీణ్ సకాలంలో స్పందించి రక్తదానం చేసినట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు తెలిపారు. రక్తదాత ముదాం ప్రవీణ్‌ను పలువురు అభినందించారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి: నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు డిమాండ్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ..జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఆట మైదానాలు లేవని, ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవడం లేదని, అర్హత లేని వారితో విద్యార్థులకు చదువులు చెప్పిస్తున్నారని విమర్శించారు. జీవో-91కు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూని ఫామ్స్ అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎంఈవో రాజులుకు వినతి పత్రం సమర్పించారు. ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బైరాపూర్ రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలి



గాంధారి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి మురళి, ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం బ్రాహ్మణపల్లి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సరస్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సమాఖ్య సంఘాలను మరింత బలోపేతం చేయాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధ్యక్షుల బాధ్యతలను వివరించారు. గ్రామాల్లో వికలాంగుల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అందరూ చదువుకోవాలని సూచించారు. మండల సమాఖ్య ప్రతినిధులు, డీపీఎం సురేశ్‌కుమార్, రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



రామారెడ్డి: కన్నాపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని ఎంఈవో ఆనంద్‌రావు నిర్వహించారు.ఈసందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థుల సామర్థ్యాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు పంగి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



నస్రుల్లాబాద్: అంగన్‌వాడీ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాల ని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు.శుక్రవారం లింగంపల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారులతో కలసి పాటలు పాడించారు. సీజనల్ వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడాలని, తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో సూర్యకాంత్ ఉన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



భిక్కనూరు: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయం 40వ వార్షికోత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాతకు వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. ఒడి బియ్యం పోసి కట్నకానుకలను సమర్పించుకున్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన శనిశెట్టి శ్రీనివాస్-సరోజ దంపతులు పెద్ద ఎత్తున ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆర్యవైశ్యసంఘం గౌరవ అధ్యక్షుడు పబ్బనాగరాజు, అధ్యక్షుడు పురాం రాజమౌళి, ప్రధాన కార్యదర్శి చల్ల లక్ష్మణ్, కోశాధికారి కోడిప్యాక వెంకటేశం, ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెల్లో నిలిచిన అభివృద్ధి

- జీపీ భవన నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో..?
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- ఇబ్బందుల్లో పంచాయతీ అధికారులు, గ్రామస్తులు
- కొత్తగా మద్నూర్, డోంగ్లీ, మల్లాపూర్ లకు జీపీ భవనాల మంజూరు



మారేపల్లిలో నిర్మాణంలో ఉన్న జీపీ భవనం



సిర్‌పూర్‌లో రేకుల షెడ్‌లో జీపీ కార్యాలయం

మద్నూర్(జుక్కల్): మూడేళ్ల క్రితం ప్రభుత్వం సొంత భవనాలు లేని జీపీలకు నూతన భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసింది. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఇంత వరకు నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించాలని పనులు మొదలుపెట్టినా కొన్ని ఇంత వరకు పూర్తి కాలేదు. మరికొన్ని అసలుకే మొదలుపెట్టలేదు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో మొత్తం ఏడు నూతన గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. రెండున్నరేళ్ల క్రితం నిర్మాణాలు ప్రారంభించారు.. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలో సోమూర్, చిన్న టాక్లీ, ఇలేగావ్, మారేపల్లి, చిన్న ఎక్లార గ్రామాల్లోని పంచాయతీ భవనాలు నిర్మాణ దశలో ఉండగా.. చిన్న తడ్గూర్, సిర్‌పూర్ గ్రామాల్లోని పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభమే కాలేదంటే గత ప్రభుత్వం పనితీరు అర్థమవుతోంది. గ్రామ పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సిర్‌పూర్‌లో రేకుల షెడ్‌లో పంచాయతీ నిర్వహణ కొనసాగుతోంది. స్థలాలు, పలు రకాల సమస్యలు, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, సర్పంచ్‌లు కూడా లేకపోవడంతో జీపీ భవనాల గురించి పట్టించుకునేవారే కరువయ్యారు. సర్పంచుల పదవీ కాలం ముగిసి 16 నెలలు అవుతున్నా ఎన్నికలు జరగకపోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది. జీపీ ఎన్నికలు జరిగే నాటికైనా భవనాల నిర్మాణాలు పూర్తయితే నూతన పాలకవర్గాలు కొలువుదీరే అవకాశం ఉంటుంది.

త్వరగా పనులు ప్రారంభించాలి

మా గ్రామానికి మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలి. గ్రామంలో పంచాయతీకి భవనం లేకపోవడంతో రేకుల షెడ్‌లో కొనసాగుతోంది. దీంతో సామగ్రిని, ముఖ్యమైన డాక్యుమెంట్లను భద్రపరచడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలి.

–లక్ష్మణ్, సిర్‌పూర్

పనులు పూర్తి చేయిస్తాం

ఉమ్మడి మద్నూర్, డోంగ్లీ మండలంలో ఐదు గ్రామ పంచాయతీలు నిర్మాణ దశలో ఉండగా, రెండు జీపీల్లో అసలుకే పనులు మొదలుపెట్టలేదు. కొత్తగా మరో మూడు జీపీ భవనాలు మంజూరయ్యాయి. పనులు త్వరగా పూర్తి జరిగేటట్లు చర్యలు తీసుకుంటాం.

–రాణి, ఎంపీడీవో, మద్నూర్

పుష్కలంగా పక్కనే నీరున్నా గోసనే..



నిరసన తెలుపుతున్న గురురాఘవేంద్రకాలనీవాసులు

కామారెడ్డి టౌన్: చిన్నమల్లారెడ్డి గ్రామ పరిధిలోని గురు రాఘవేంద్ర కాలనీలో వింత సమస్య చోటుచేసుకుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు అనే చందంగా ఆ కాలనీ పక్కనే వాటర్ ట్యాంక్‌లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ నీటిని సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్వాహకం వల్ల ఈ కాలనీకి నీటి సరఫరా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురైన కాలనీవాసులు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన తెలిపారు. 2 నెలల నుంచి జీపీ సిబ్బందికి తెలియజేసినప్పటికీ నామమాత్రంగానే స్పందిస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడంలేదని కాలనీవాసులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ వ్యవస్థను మార్చి శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

‘అప్రమత్తంగా ఉండాలి’



పరిశీలిస్తున్న అధికారి సుధాకర్

భిక్కనూరు: ఎయిడ్స్ వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం మేనేజర్ చల్ల సుధాకర్ సూచించారు. గురువారం భిక్కనూరులోని పాత దళితవాడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఏడాదికి ఒకసారైనా రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇలా పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏదైనా అనారోగ్యం ఉంటే బయటపడుతుందని పేర్కొన్నారు. పరీక్షలు చేసి అవసరమున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. క్షయ వ్యాధి నివారణ అధికారి రాధిక, క్షయవ్యాధి డబ్ల్యూహెచ్వో కన్సల్టెంట్ స్నేహ, ఎపిడెమియాలజిస్ట్ రాజేశ్వరి, వైద్యులు యెమిమా, ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ సతీశ్ పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం నిల్వనీటిని పారబోయాలి



ఇబ్రహీంపేట్‌లో నిల్వ నీటిని పారబోయిస్తున్న డీఎల్‌పీవో సత్యనారాయణ రెడ్డి

బాన్సువాడ రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ ఉంటుందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బాన్సువాడ డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపేట్ గ్రామాన్ని సందర్శించారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ప్రతి శుక్రవారం ఇంటిలో కుండీలు, తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. జీపీ కార్యదర్శి నవీన్ కుమార్ ఉన్నారు.

భిక్కనూరు/సదాశివనగర్(ఎల్లారెడ్డి): భిక్కనూరు, సదాశివనగర్ మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ నీళ్ల కుండీలు, డ్రమ్ముల్లో ఉన్న నిలువ నీటిని పారబోశారు. ఇంటి ఆవరణలో టైర్లు, కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలన్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గుండారం గ్రామస్తులు

రాజంపేట: ఎల్లారెడ్డిపల్లి, సిద్దాపూర్ గ్రామాల్లోని బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుండారం గ్రామస్తులు శుక్రవారం రాజంపేట తహసీల్దార్, ఎస్సైలతో పాటు దోమకొండ ఎక్సైజ్ శాఖలకు వినతి పత్రం అందజేశారు. గుండారంలో ఇటీవల మద్యం నిషేధించడంతో పక్క గ్రామాలైన ఎల్లారెడ్డిపల్లి, సిద్దాపూర్ గ్రామాలలో జోరుగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారని, దీంతో మద్యం తాగి తమ గ్రామస్తులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు.

విద్యుత్ తీగలను సరి చేశారు



తీగలను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎల్లారెడ్డి: మాచాపూర్‌లో బేస్త సాయిలుకు చెందిన వ్యవసాయ పొలంలో ఈదురు గాలులకు కింద పడిన విద్యుత్ తీగలను శుక్రవారం విద్యుత్ సిబ్బంది సరిచేశారు. విద్యుత్ తీగలు కింద పడి వ్యవసాయ పనులకు ఇబ్బంది కలగడంతో ‘విద్యుత్ తీగలు సరిచేయరా’ అనే శీర్షికతో ఈ నెల 27న వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి రైతు పొలంలో నూతనంగా స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను సరిచేశారు.

సాక్షి ఎఫెక్ట్..

వాహనాల వేలం పాట



వాహనం వేలం పాట వేస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): సారా,గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డ వాహనాలకు శుక్రవారం బిచ్కుంద ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వేలం చేపట్టారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 16న ‘తుప్పు పడుతున్న వాహనాలు’..అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించి వాహనాల వేలం పాట నిర్వహించారు. రూ.22,400 వేలం పాట ద్వారా ఆదాయం వచ్చిందని సీఐ తెలిపారు.

కబ్జా చేశారు.. చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తున్న ఘన్‌పూర్(ఎం) గ్రామస్తులు

మాచారెడ్డి: ఘన్‌పూర్(ఎం)లోని కొండయ్య కుంటను ఒక మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేశాడని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ సరళకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సరళ స్పందించి.. సర్వే చేసి నిజనిజాలు వెల్లడి చేస్తానని హామీ ఇచ్చారు.

నేటి చిత్రం



ప్రాథమిక పాఠశాలకు అందుబాటులో ఉన్న మరుగు దొడ్డి

మరుగుదొడ్లను నిర్మించండి

రామారెడ్డి: రామారెడ్డి ప్రాథమిక పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు అందుబాటులో లేవు. విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. 250 మందికి రెండే మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. మరో రెండు మరుగుదొడ్లు నిర్మిస్తే బాగుంటుంది.

– రాజు, విద్యార్థి తండ్రి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నా

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



ముత్యంపేటలో మున్నూరుకాపు సంఘం భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

దోమకొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో చేపట్టిన పనులను ప్రారంభించినట్లు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తెలిపారు. తాను ఇచ్చిన మాట నేరవేర్చుకుంటున్నానని అన్నారు. కామారెడ్డి ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ముత్యంపేటలో రెడ్డి, గౌడ, మున్నూరుకాపు, కుర్మ సంఘాల భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం దోమకొండలోని కుర్మ, గొట్టిముక్కులలో రెడ్డి, మున్నూరు కాపు, అంచనూరులో ముదిరాజ్ సంఘ భవనాలను ప్రారంభించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి సంతోష్ రెడ్డి, బీజేపీ దోమకొండ మండల అధ్యక్షుడు మద్దూరు భూపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు అనుపటి నరేందర్ రెడ్డి, నేతలు కంది మనోజ్ కుమార్, తిప్పపురం రవి, బుచ్చిరాజు,తదితరులు పాల్గొన్నారు.

బీబీపేటలో..

బీబీపేట: మండల కేంద్రంతో పాటు మల్కాపూర్, తుజాల్‌పూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, మాందాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఆలయ పనులతో పాటు, ఫంక్షన్ హాలులకు సొంతంగా నిధులు ఇచ్చారు. అవి పూర్తి కావడంతో ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల బీజేపీ నాయకులు సంతోష్ గౌడ్, శివ, సురేష్, దేవరాజు గౌడ్, సంతోష్‌రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



గట్టుమైసమ్మ తండాలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పొంచి ఉన్న ముప్పు

లింగంపేట(ఎల్లారెడ్డి): గట్టుమైసమ్మ తండాలో ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేదు. విద్యార్థులకు అందే ఎత్తులోనే ఉంది. ఆడుకుంటూ వెళ్లి తగిలినా కరెంటు షాక్ తగిలే అవకాశం ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి మార్చాలని కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎప్పటికైనా ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

షట్టర్లు ఏర్పాటు చేయండి



మిర్జాపూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

నస్రుల్లాబాద్:మిర్జాపూర్ గ్రామ ఊర చెరువు తూముకు షట్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామ రైతులు గ్రామ పంచాయతీ భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే పంట కాలువ తూముకు షట్టర్ లేకపోవడంతో చెరువులో ఉన్న నీరు వృథా అవుతుందన్నారు. దీని కారణంగా పంటలకు సరైన సమయంలో నీరు అందక ఎండుతున్నాయన్నారు. అధికారులు స్పందించి షట్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మిర్జాపూర్ సొసైటీ చైర్మన్ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.


ఆయిల్‌పామ్ సాగు కోసం దరఖాస్తు చేసుకోవాలి



లింగారెడ్డిపేటలో మాట్లాడుతున్న ఏఈవో రాజాగౌడ్

ఎల్లారెడ్డిరూరల్: ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం లింగారెడ్డిపేటలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సంబంధించిన వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ చెట్ల సాగు కోసం ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వీరికి ప్రభుత్వం మొక్కలపై, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు.

మెగా శాకాహార ర్యాలీకి తరలిరావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్థానికులు, నిర్వాహకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించే మెగా శాకాహార ర్యాలీకి భారీ సంఖ్యలో తరలి రావాలని తాడ్వాయి ధ్యాన నిర్వాహకులు గంగారెడ్డి కోరారు. ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను తాడ్వాయిలో ఆవిష్కరించారు. గ్రామంలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

సంక్షిప్తం

ఘనంగా బోనాల ఊరేగింపు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మేజర్‌వాడిలో శుక్రవారం ముత్యాల పోచమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగించారు. అమ్మవారికి బోనాలను సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వర్షాల కోసం నేడు అన్నదానం

మద్నూర్(జుక్కల్):వానాకాలం ప్రారంభం నుంచి ఇంత వరకు సరైన వర్షాలు కురవలేదని వర్షాలు బాగా కురిసి పాడి పంటలు బాగుండి రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ మండల కేంద్రంలోని నడిమి హనుమాన్ ఆలయంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహా అన్నదానం కోసం నిర్వాహకులు గ్రామంలో చందాలు పోగుచేసి అన్నదాన కార్యక్రమం, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

దాబాలలో మద్యం సేవిస్తే కేసులు

ఎల్లారెడ్డిరూరల్: దాబాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై మహేష్ హెచ్చరించారు. గురువారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని పలు దాబాలలో తనిఖీలు చేశారు. కిచెన్, స్టాక్ రూంలను పరిశీలించారు.

నర్సరీ పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): సురాయిపల్లి శివారులోని నర్సరీని శుక్రవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ, గ్రామ పంచాయితీ సిబ్బందికి మొక్కలు పెంచడానికి స్థలాలు ఎంపిక చేసి సిద్ధం చేయాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో నరేందర్, ఉన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి: గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ సూచించారు. శుక్రవారం తిమ్మారెడ్డి గ్రామ పంచాయతి కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. పలు సూచనలు చేశారు.జీపీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

కంటివైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గాంధారి(ఎల్లారెడ్డి): గుర్జాల్, గుర్జాల్ తండా, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ రేణుక చౌహాన్‌తో కలిసి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ తెలిపారు.

పాలాభిషేకం

రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు సకాలంలో జమచేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మదన్ మోహన్ చిత్ర పటాలకు ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నాయకులు తూర్పు రాజు, ఆకుల లక్ష్మణ్, సాయిబాబా, మదార్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.